క్లుప్తంగా

కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



తెనాలిటౌన్: ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.వి.సుబ్బారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో సిబ్బందితో కలిసి పర్యటించారు. సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలకు సర్వేపై తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఈ నెల 26 నుంచి జులై 16 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ఎవరికైనా చర్మలపై స్పర్శ లేని మచ్చలు, నొప్పిలేని, బుడిపిలు లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపించాలన్నారు. వైద్యులు నిర్ధారణ చేసి మందులు ఇస్తారని డాక్టర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



వేమూరు: ఉపాధి కార్మికుల వేతనాలు వెంటనే విడదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.అగస్టీన్ కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఈ మేరకు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 14 రోజుల లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉండగా ఇంత వరకు ఇవ్వలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికుల వేతనాలు వెంటనే విడదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జల్లి రత్నకుమారి, టి.మరియమ్మ, గేరా సౌజన్య, కె.దివ్య, అరుణ, చోడవరపు జాన్ తదితరులు పాల్గొన్నారు.

వేటకెళ్లిన మత్స్యకారుడి మృతి

రేపల్లె: కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందిన ఘటన గంగడిపాలెం పంచాయతీలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సైకం వెంకటేశ్వరరావు(52) ఆదివారం రాత్రి గంగడిపాలెం సమీపంలోని కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లాడు. సోమవారం ఉదయం వరకు ఇంటికి తిరిగిరాకపోవటంతో నది ఒడ్డున గాలించగా అతని మృతదేహం కనిపించింది. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు జమ

మంగళగిరి: సీఆర్‌డీఏ నుంచి ఎంటీఎంసీలో విలీనమైన కార్మికులకు మూడుల నెలల పెండింగ్ జీతాలను సోమవారం కార్మికుల ఖాతాలకు జమ చేసిన ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవికి సీఐటీయూ నాయకులు ఎం.రవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాచూరి వేణు ధన్యవాదాలు తెలిపారు. సీఆర్‌డీఏ నుంచి ఎంటీఎంసీలోకి విలీనమైన ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు మార్చి నెల నుంచి జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.

ఉన్నచోటనే స్థలాలకు పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: ఉన్నచోటనే స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి స్థానికంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు కోరారు. సోమవారం తాడేపల్లి సుందరయ్యనగర్, కృష్ణవేణి నగర్ వాసులు 21,22,23 వార్డుల సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అడ్మిన్లకు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.వెంకటరావు, కె.గడ్డన్న, పీఎస్ఎం నాయకులు జగన్, పట్టణ నాయకులు కొట్టే కరుణాకరరావు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి, పి.గిరిజ, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయ, యనమాల బర్నబాస్, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కె.ఉషారాణి, బి.నాగేశ్వరి, బొబ్బిలి రామారావు, బి.నాగేశ్వరి, నారిన నాగేశ్వరరావు, సుధ పాల్గొన్నారు.

ప్రజా సేవాలయాలు

- ప్రజలకు చేరువైన సచివాలయాలు
- తెనాలి పట్టణంలో 47 సచివాయాలు ఏర్పాటు
- అందుబాటులోకి వచ్చిన పౌరసేవలు



10వ వార్డులో శాశ్వత భవనంలో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయం



24వ వార్డు అడ్మిన్ అబ్దుల్లాకు దరఖాస్తు అందిస్తున్న మహిళ

తెనాలిఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. గతంలో పనుల కోసం వివిధ ప్రభుత్వ కార్యాయలకు వెళ్ళాల్సి వచ్చేది. సచివాయాలు ఏర్పాటు చేసిన తర్వాత ఆపరిస్థితి పూర్తిగా మారిపోయింది. అన్ని శాఖల ఉద్యోగులను నియమించి అందరి అవసరాలు తీర్చివిధంగా దీనిని రూపుదిద్దారు. దీంతో ప్రజలకు ప్రభుత్వ సేవలన్ని అందుబాటులోకి వచ్చినట్లు అయ్యింది. రెండు వేల జనాభాకు ఒక సచివాయం

రెండు వేల జనాభాకు ఒక సచివాలయం...

తెనాలి పట్టణంలో 47 సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నిటిని ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేయగా, మరికొన్ని అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. అలాగే సచివాలయంలో పనిచేసేందుకు వార్డు అడ్మినిస్ట్రేటీవ్ సెక్రెటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రెటరీ, వార్డు ఎడ్యుకషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ, వార్డు ఎమినిటీ సెక్రెటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీ, వార్డు రెవెన్యూ సెక్రెటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్ మెంట్ సెక్రెటరీ, మహిళా పోలీస్, వార్డు హెల్త్ సెక్రెటరీ, ఎనర్జి అసిస్టెంట్‌లు దీనిలో పనిచేస్తుంటారు. వీరందరు ఆయా శాఖలలోని అధికారుల సూచనల మేరకు ఇక్కడ పనిచేస్తుంటారు.

ప్రజలకు అందుబాటులో 545 పౌర సేవలు...

వార్డు సచివాలయాల పరిధిలోకి 545 పౌర సేవలను ప్రభుత్వం తెచ్చింది. నిత్యం ప్రజలకు అవసరమయ్యే రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ, గిరిజన, సాంఘీక, వికలాగ సంక్షేమ శాఖలు, వైద్య, ఆరోగ్య, గృహ నిర్మాణ, కార్మిక, పరిశ్రమ, జౌళి శాఖలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలను వీటి పరిధిలోకి తెచ్చారు. ఆయా శాఖల్లో ఏదైన పని ప్రజలకు వస్తే ఆయా కార్యాలయాలకు వెళ్ళకుండా స్థానికంగా ఉండే సచివాలయాలకు వచ్చి పరిష్కారం పొందే అవకాశం కల్పించారు. ఉదాహరణకు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం పట్టణంలో వీఆర్‌వో, ఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి వాటిని పొందాల్సి వచ్చేది. అలాగే డెత్, బెర్త్ సర్టిఫికెట్‌లు, ఇంటి పన్నుల పేరు మార్పు వంటి పనులకు మున్సిపాలిటీకి వెళ్ళాల్సి వచ్చేది. కానీ ఈరెండు పనులకు సంబంధించిన దరఖాస్తులను సచివాలయం ఇచ్చి వాటిని పొందే అవకాశం వచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం వంటి వాటికి దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధృవీకరణ పత్రాలు కూడ ఇక్కడ నుంచి పొందే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే దాదాపు పౌర సేవలన్ని సచివాలయాల పరిధిలోకి తెచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేయానటంలో ఎటువంటి సందేహం లేదు.

కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు



గతంలో వివిధ అవసరాల కోసం ఆయా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేది. కానీ సీఎం జగన్ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అన్ని శాఖలను వాటి పరిధిలోకి తెచ్చారు. దీంతో వివిద పనులకు పదేపదే ఆయా ప్రభుత్వ కార్యాలయాకు వెళ్ళకుండా సచివాలయంలోనే అన్ని అవసరాలు తీర్చుకునే అవకాశం కలిగింది.

–కొణిజేటి లక్ష్మి, ఈబీసి నేస్తం లబ్ధిదారులు

రవాణా ఖర్చులు తగ్గాయి



సచివాలయాలను స్థానికంగా ఏర్పాటు చేయడం అభినందనీయం. గతంలో వివిధ పనుల కోసం ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి రావడానికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ అయ్యేవి. కానీ వీటిని మా వార్డులోనే ఏర్పాటు చేయడంతో రవాణ ఖర్చులు, గంటల కొద్ది వేచి చూసే పని తప్పింది.

–సుశీల, మారీసుపేట, తెనాలి

సర్టిఫికెట్లు అన్ని సచివాలయం నుంచే



ప్రభుత్వం అందించే పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు అవసరం. వాటి కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ పలు మార్లు తిరగాల్సి వచ్చేది. కానీ వార్డులో సచివాలయాలను ఏర్పాటు చేసిన తర్వాత అన్ని సర్టిఫికెట్‌లను ఇక్కడే దరఖాస్తు చేసి పొందే అవకాశం కలిగింది. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–పోలం శివకుమారి, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు

30 ఏళ్ల గ్రామస్తుల కల సాకారం

- రూ.రెండు కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు ఏర్పాటు
- గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళకు లబ్ధికూరిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: గ్రామస్తుల 30 ఏళ్ళ కల సాకారం అవుతుందని, రూ.రెండు కోట్లతో గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎస్టీ కాలనీ నుంచి తొలి రోజు ప్రారంభించారు. ప్రభుత్వం అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ళలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన పనులు, సంక్షేమ పథకాలు గురించి ప్రజలను అడిగారు. అర్హులు ఉన్నట్లయితే అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. రోడ్లు, మురుగు కాల్వల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో రూ.40 లక్షలతో గ్రామంలో పనులు చేపడతామన్నారు. సర్పంచ్ పవన్‌కుమార్ సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీస్సులతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు.

నందివెలుగు పరిధిలో అభివృద్ధి పనులు....

నందివెలుగులో రూ.25.65 కోట్ల నగదును ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమచేశారన్నారు. 993 మందికి రూ.8.21 కోట్లు పింఛన్ ద్వారా అందించామని, అమ్మ ఒడి పథకం ద్వారా 571 మందికి రూ.2.23 కోట్లు పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్ కాపు నేస్తం కింద రూ.1.10 కోట్లు జమ చేశామని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి, వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇస్తున్నామని తెలిపారు. సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి గదులు నిర్మిస్తున్నామని, ఎమ్మెల్యే తల్లిదండ్రులు రుణపడి ఉంటారన్నారు. పేద విద్యార్థులు పాఠశాలలో చదువుకోవడానికి సదుపాయాలు కలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఎంపీటీసీ షేక్ షిలార్ జానీ, ఎంపీడీఓ విజయాలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ తోటకూర వసంతరావు, శివాలయం చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ళ దుర్గాప్రసాద్, పానకలు, రాజగోపాలరావు, బెజ్జం బాజీ, మంగా శివనాగేశ్వరరావు, చిట్టిబాబు, చీదర్ల శాంతి రాజు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మీ, ఏపీఎం జయశ్రీ, సి.సి.సుబ్బారావు, కసుకుర్తి దానియేలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఈబీ అధికారులు, పోలీసులు



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు

తెనాలిరూరల్: సమాజంలో అశాంతి నెలకొనడంలో మాదక ద్రవ్యాల వినియోగం ప్రధాన కారణాల్లో ఒకటని తెనాలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఈబీ, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీని సోమవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేయించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులు అధికారులు మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదక ద్రవ్యాల గురించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అక్రమ రవాణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎం. వినితారెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ చితర శ్రీనివాస్, ఎసీబీ, పోలీసు సిబ్బంది. పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో సిరి మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రమణ, కె. రాజు పర్యవేక్షించారు. గుంటూరు జిల్లా చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మాదక ద్రవ్యాల వినియోగం దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ ప్రతినిధి ఎం. జాన్‌బన్యన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, కార్యదర్శి జి. స్వరూపరాణి, మహిళా పోలీస్ మాణిక్యం, సునీల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తెనాలిఅర్బన్: మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటికి అందరూ దూరంగా ఉండాలని ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లోని ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. శారీరకంగా, మానసికంగా దెబ్బతింటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుబేదార్ కిషన్ జ్యోతి, సీహెచ్ఎం దోర్జిదావా, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

తెనాలిరూరల్: విద్యార్థులందరూ విద్యార్థి దశ నుంచే విలువలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా తెనాలి మండలం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్ఆర్ఐ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, సీనియర్ న్యాయవాది ఎన్‌వీ మహేశ్వరరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుకేక పాదయాత్రకు సంఘీభావం

తాడేపల్లిరూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న పోరుకేక మహాపాదయాత్రకు సోమవారం సీపీఎం తాడేపల్లి మండల కమిటీ సంఘీభావం తెలిపింది. సీపీఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి, నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరారు.

30న విజయవాడలో కౌలురైతుల మహాధర్నా



గుడివాడలో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: కౌలురైతులు అందరికీ గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు అందించాలని కోరుతూ ఈనెల 30న విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రూరల్ మండలం గుడివాడ, కొలకలూరు, ఎరుకలపూడి గ్రామాల్లో సోమవారం రైతు, కౌలురైతు సమావేశాలను నిర్వహించారు. కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేటల నుంచి ప్రవహించే పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకాన్ని రబీ సీజనులోనైనా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులపై రూ.35 వేల కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించినందున ఖరీఫ్‌లో ఎరువుల ధరలు మరింత పెరుగుతాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా విడుదల చేయాలని కోరారు. రైతు సంఘం అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, కె.గగారిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ఇంటూరు(వేమూరు): బాలల హక్కుల చట్టాలు గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని తెనాలి సివిల్ కోర్టు జడ్జీ మాలతి పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఖాదర్ హుస్సేన్, బి.రవీంద్ర, కనపర్తి ఇశ్రాయేలు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా షంషుద్దీన్‌బాబా ఔలియా ఉరుసు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల శివారులోని మల్కా చెరువు వద్ద ఉన్న హజరత్ షేక్ షంషుద్దీన్ బాబా ఔలియాదర్గా 77వ ఉరుసు ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్ధరాత్రి దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహించి గుర్రంపై గంధం ఉంచి తీన్‌మార్, పకీర్ మేళాలతో రెండు గ్రామాల్లో ఊరేగించారు. సోమవారం ఉదయం పకీర్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దీపారాధనలు చేశారు. అనంతరం సాయంత్రం దర్గాను విశేషంగా అలంకరించి భక్తులకు అన్నదానం చేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల గ్రామ శివారులో ఈ నెల 13వతేదీ చోటుచేసుకున్న హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ కె.వాసు సోమవావరం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి వడ్డవల్లి, శాలివాహననగర్‌కు చెందిన మందా సైదేశ్వరరావు(33) డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. సైదేశ్వరరావు సమీప బంధువులు అయిన నలుగురు కలిసి ముందస్తు పథకం ప్రకారం నిందితుల వద్ద ఉన్న వేటకొడవళ్లతో హత్యచేసినట్లు తెలిపారు. హత్య చేసిన వారిలో గుంటూరు తురకపాలెం రోడ్డులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మేమ సుధాకర్, స్తంభాలగరువుకు చెందిన పఠాన్ సుభాని, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం ఉప్పరపాలేనికి చెందిన జూటూరు వెంకటరావులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అదే విధంగా గుంటూరు శ్రీకృష్ణదేవరాయ నగర్ రైలుకట్టకు చెందిన ఏసుబాబు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్ల శివారులో ఉన్న జగనన్న ప్లాట్లవద్దకు ఆటోబాడిగ ఉందని సైదేశ్వరరావును నమ్మబలికి తీసుకొచ్చి నిందితులు హత్యచేనట్లు పోలీసుల విచారణలో తేలిందని సీఐ తెలిపారు. హత్య చేసిన నలుగురిలో ముగ్గురిని అదుపులోనికి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

29న తెనాలిలో గోవధ నిషేధం

తెనాలిఅర్బన్: బక్రీదు పండుగను పురస్కరించుకుని ఈనెల 29న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో గోవధ నిషేధించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. గోవులను, ఒంటెలను వధించరాదని చెప్పారు. ఎవరైన ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేఖంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన సూర్య ప్రకాశరావు (67) బంగారు ఆభరణాల దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి దుకాణం నుంచి వెళ్తుండగా గంగానమ్మపేట పాత శివాలయం వద్ద బైకు ఢీకొనడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వేస్టేషన్ యడ్ల లింగయ్య కాలనీ మధ్యలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ళ మధ్య ఉంటుంది. నల్ల చొక్కా, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు గోడ గడియారాల అందజేత

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురులోని జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థులు గోడ గడియారాలను అందజేశారు. పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేలనంలో భా గంగా పాఠశాలకు గోడ గడియారాలను ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలలోని 25 తరగతి తదులకు 25 గడియారాలను పూర్వ విద్యార్థుల ప్రతి నిధులు కె. సత్యనారాయణ, పి. నాగరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధకు సోమవారం అందజేశారు.

లారీ డ్రైవర్ అదృశ్యం

తెనాలిరూరల్: అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన లారీ డ్రైవర్ తెనాలిలో అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు రైల్వే కోడూరుకు చెందిన 60 ఏళ్ల చిన యానాదయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన తెనాలి పట్టణ మోరిస్‌పేటకు వచ్చి అదృశ్యమయ్యాడు. అతని కుమారుడు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్ కుమార్ తెలిపారు.

ఈ లక్షణాలుంటే కుష్ఠు ఉన్నట్లే..జాగ్రత్త పడండి

నిజాంపట్నం: ఒంటిపై అనుమానిత మచ్చలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని హెల్త్ సూపర్ వైజర్ మురళీ కోరారు.కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా గుర్నాథ నగర్‌లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మురళీ మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన, రాగి, ఎరుపు రంగు మచ్చలు, చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురదలేని మచ్చలు, వాచిన, నొప్పిగా ఉన్న నరాలు వంటి లక్షణాలు కనిపిస్తే..వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ఫిరంగిపురం: పేద విద్యార్థులను ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంతలో ఆదుకోవాలని సదావర్తి అన్నదాన సత్రం ట్రస్ట్ ఫౌండర్ జి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలోని సదావర్తి అన్నదాన సత్రంలో సోమవారం మేడికొండూరు. యడ్లపాడు, ఫిరంగిపురం మండలాల పాఠశాలల ఉపాధ్యాయులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ చైర్మన్ జి.ఉషారాణి, ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.